నేటి విద్యార్థులే భావితరాల శాస్త్రవేత్తలు

చింతల్: భావితరాల శాస్త్రవేత్తలే నేటి విద్యార్థులని క్యూఎంఆర్ఎస్ఎంఏ చైర్మన్ పి.శివయ్య అన్నారు. పట్వారినగర్ నవజ్యోతి పాఠశాలలో రెండు రోజుల పాటు జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫియస్టా 2024) శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆయనతో పాటు ట్రస్మ సంఘం ప్రతినిధులు, నవజ్యోతి విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిరా రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలు తిలకించి ప్రశంసించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సుభాష్‌నగర్: మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శుక్రవారం మహదేవపురంలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పైపులైన వ్యవస్థలను మెరుగు పరుస్తున్నామని తెలిపారు. స్థానిక నాయకులు నవాజ్, మురళీకృష్ణ, జగదీశ్వర్‌రెడ్డి, నాగేష్, సురేష్‌రెడ్డి, నరేందర్, మహేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదానం

రంగారెడ్డినగర్: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహాదానమని శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ సీనియర్ సభ్యులు మోతే రాజేశ్వర్, జింకల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం అమావాస్య సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్, పంచశీలకాలనీలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సేవే లక్ష్యంగా గత కొన్నేళ్ల క్రితం శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ సంస్థను స్థాపించి పేదలు, విద్యార్థులు, మహిళలు, కార్మికులకు తోచినంతలో కమిటీ నేతృత్వంలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తాండూరు భాశయ్య, వెంకట సూర్యనారాయణ, ఆరే రామకృష్ణ ముదిరాజ్, ఎస్. సంజీవ్‌కుమార్, డాక్టర్ వినయ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారు'

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి లబ్ధి చేకూర్చేలా చూడాల్సిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కేపీ విశాల్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. తాజాగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ఏసీపీ స్థాయి అధికారులపై దుర్భాషలాడి అమానుషంగా ప్రవర్తించారన్నారు. ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన ఎమ్మెల్యే ఈ విధంగా వ్యవహరించడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ఇలా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలే బీఆర్ఎస్‌కు గుణపాఠం చెబుతారని విశాల్‌గౌడ్ అన్నారు.

గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి అరెస్టు

జగద్గిరిగుట్ట: ఇంట్లో గంజాయి మొక్కను పెంచుతున్న వ్యక్తిని బాలానగర్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌కు చెందిన దిలీప్‌కుమార్ షా(40) తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కను పెంచుతున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం ఇంటిపై దాడి నిర్వహించి దిలీప్‌కుమార్‌షాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని తదుపరి విచారణ నిమిత్తం జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జాతరకు సర్వం సిద్ధం

నేటి నుంచి సూరారం కట్టమైసమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకున్న బాలానగర్, మేడ్చల్ ఏసీపీలు

సూరారం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రెండో అతిపెద్ద జాతరగా సూరారం కట్టమైసమ్మ జాతర పేరొందింది. ఎన్నో ఏళ్లుగా మైసమ్మ అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ జాతర కొనసాగనుంది.

ఆలయ చరిత్ర..

నిజాం హయాంలో షేక్ అబ్దుల్ పాషా నవాబ్ సంస్థానంలో సూరారం గ్రామం భాగంగా ఉండేది. అప్పట్లో సూరారం గ్రామానికి చెరువును తవ్వించి కట్ట నిర్మించగా పలుమార్లు ఆ కట్ట కూలిపోయింది. దీంతో చెరువు పనుల్లో కూలిగా పని చేస్తున్న సూరయ్య అనే గ్రామస్తుడు ఈ విషయమై నవాబు వద్దకు వెళ్లి కట్ట పదే పదే కూలిపోతోందని.. అక్కడ కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే బాగుంటుందని తెలిపాడు. దీంతో చెరువు కట్టను నిర్మించి దానిపై మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా కట్ట కూలిపోకుండా అలాగే నిలిచింది. అంతే కాకుండా అమ్మవారిని దర్శించుకుని కోర్కెలు కోరే భక్తుల అభీష్టాలను తీర్చే కల్పతరువుగా విరాజిల్లుతూ వచ్చింది.

◆ ఈ నేపథ్యంలో 1999లో కట్ట మీదుగా వెళ్తున్న ఓ డీసీఎం వాహనం అదుపు తప్పి అమ్మవారి గుడికి పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొట్టడంతో అమ్మవారి విగ్రహం స్థానభ్రంశమైంది. దీంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించిన గ్రామస్తులు, భక్తులు 2002 ఆలయాన్ని పూర్తి చేసి అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతిఏటా మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి ప్రత్యేక జాతర నిర్వహిస్తు వస్తున్నారు.

జాతర వివరాలు..

సూరారం చెరువు కట్టపై వెలిసిన కట్టమైసమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్ల జాతర వేడుకలు ఈనెల 10న ప్రారంభం కానున్నాయి. నగరంతో పాటు మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. 10వ తేదీ జాతర మొదటి రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, పంచామృత స్నానంతో జాతర మొదలవుతుంది. ఉదయం 8 గంటలకు పుణ్యావాచనము, గణపతి పూజ, అంకురార్పణ, దీక్షాధారణ, అగ్రిప్రతిష్ఠ, నవవర్ణ జపహోమం, మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణము, తలంబ్రాలు, ఒడి బియ్యం సమర్పణ, సాయంత్రం 5 గంటలకు సూరారంలోని శ్రీరామాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుంది.

◆ 11వ తేదీ బోనాల జాతర, ఉదయం 5 గంటలకు ప్రత్యేక అలంకరణ, శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు, ఒడి బియ్యాలు, బోనాల సమర్పణ, మొక్కుబడులు చెల్లింపులు, 12వ తేదీన రంగం, భవిష్యవాణి, పోతరాజుల విన్యాసాలు, ఫలహారబండి ఊరేగింపు, ఉంటాయి. 14వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్, బాలానగర్ చౌరస్తా, నర్సాపూర్‌ల నుంచి ప్రతి 15 నిముషాలకు ఓ బస్సు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న పలువురు..

జాతర నేపథ్యంలో శుక్రవారం కట్టమైసమ్మను బాలానగర్, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీలు దర్శించుకోగా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. అదే విధంగా జోగిని రాధిక అమ్మవారికి వెండి బిందెలో బోనం సమర్పించింది. సూరారం పీఎస్ సీఐ వెంకటేశ్వరరావు ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎట్టకేలకు స్పందించారు

సాక్షి ఎఫెక్ట్..


కాలనీలో మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని బూరుగు బావి గండయ్య కాలనీలో కొన్ని రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. శుక్రవారం 'కలుషిత నేటి సరఫరాతో తిప్పలు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కొంపల్లి మున్సిపల్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు శుక్రవారం ఆ కాలనీకి చేరుకొని సమస్య ఉన్నచోట సిబ్బందితో పనులు ప్రారంభించారు.

నిర్మాణ వ్యర్థాల డంప్.. చలానా విధింపు



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురం ప్రధాన రహదారిలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన భవన నిర్మాణ వ్యర్థాలను ప్రధాన రహదారిపై వేస్తూ రోడ్డును ఆక్రమిస్తున్న దుకాణ యజమానులకు మున్సిపల్ అధికారులు చలానా విధించారు. మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణదారులకు చలాన్‌లు విధించారు. వ్యాపారస్తులు కాలనీ రహదారులను ఆక్రమణలకు పాల్పడవద్దని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రంగారావు, జగదీశ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి ఉన్నారు.

వరల్డ్ చాంపియన్‌గా శ్రీచైతన్య పాఠశాల

కుత్బుల్లాపూర్: అమెరికా నాసాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ మాడ్యూల్ డిజైన్‌పై ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన 'లివ్ ఇన్ ఏ హెల్దీ స్పేస్ డిజైన్' పోటీల్లో కొంపల్లి శ్రీచైతన్య పాఠశాల వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. కొంపల్లి-2 శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి నిషా రూపొందించిన జీవస్ ప్రాజెక్ట్, కొంపల్లి-5 బ్రాంచ్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి యషిక తయారు చేసిన మొరింగ ప్రాజెక్ట్, లహరి, శోభిత, అభినవ కృష్ణ, సాయి శ్రీకర్‌రెడ్డిలు రూపొందించిన అఫ్రికాట్ ప్రాజెక్టులు ఉత్తమ ప్రాజెక్టులుగా బహుమతిని గెలుపుచున్నాయి. శుక్రవారం శ్రీచైతన్య పాఠశాలల అకాడమిక్ డైరెక్టర్ సీమ, కొంపల్లి జోన్ పాఠశాలల ఏజీఎం రమణారావు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

పోకిరీలపై చర్యలు తీసుకోవాలి

జీడిమెట్ల: అర్ధరాత్రి గోడలు దూకి ఇళ్లలోకి ప్రవేశించి తలుపులు కొడుతున్న దుండగుల విషయపై జీడిమెట్ల పీఎస్‌లో కేసు నమోదైంది. జీడిమెట్ల పీఎస్ పరిధిలోని సాయినగర్‌లో గత కొన్ని రోజులుగా అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గోడలు దూకి ఇళ్ల తలుపులు కొడుతూ వస్తున్నారు. దీంతో నివాసితులు మేల్కొని వారిని పట్టుకునే లోపే పరారవుతున్నారు. అర్ధరాత్రి వేళ తలుపులు కొడుతుండటంతో మహిళలు, చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. పోకిరీలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం సాయినగర్ వాసులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దుండగులను పట్టుకునే పనిలో పడ్డారు.

సత్తాచాటిన సెయింట్ మార్టిన్ విద్యార్థులు


జటాయి సీజన్-3 ఐడియా థాన్‌లో విజయం సాధించిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థుల బృందం 2022-2023 విద్యా సంవత్సరానికి సంబంధించి 'వర్చుసా జటాయు సీజన్-3 ఐడియా థాన్'లో విజయం సాధించింది. దేశవ్యాప్తంగా వేలాది టీమ్‌లు పాల్గొన్న ఈ ఈవెంట్‌లో కళాశాల విద్యార్థులు మేరీ పౌలినా, చిప్పల చిన్మయి, మీరిపెల్లి సంజన, పల్లెమీడి విహారిలు ఎల్ఎంఎం, ఎన్ఎల్‌పీ, వంటి అధునాత సాంకేతికతను ఉపయోగించి హెల్త్ కేర్ ఏ1 చాట్‌బాట్ అనే వినూత్న ప్రాజెక్ట్‌ను రూపొందించారు. దీనికి గాను విద్యార్థులకు ప్రశంస పత్రంతో పాటు వెయ్యి యూఎస్ డాలర్ల నగదు పురస్కారం అదే విధంగా రూ.6.5 లక్షల ఉద్యోగ అవకాశం లభించింది. జటాయి సీజన్-3 ఐడియా థాన్‌లో విజయం సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాల డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా, యాజమాన్యం అభినందించారు.